# రేవంత్‌ను నమ్మి మోసపోయా !!

- హరివర్ధన్‌రెడ్డి
- సర్వేలను లెక్కలోకి తీసుకోకుండా ఆదరణలేని వారికి టికెటా?
- జంగయ్య యాదవ్ డౌన్ డౌన్.. 'గో బ్యాక్ గో బ్యాక్' అంటూ నిరసనలు



కీసరలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో తోటకూర జంగయ్య యాదవ్‌ను అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కీసర, అక్టోబర్ 15 : జంగయ్య యాదవ్ 'డౌన్ డౌన్'.. 'గో బ్యాక్ గో బ్యాక్' అంటూ భారీ నినాదాలతో కాంగ్రెస్ శ్రేణులు రెచ్చిపోయారు. కాంగ్రెస్ అధిష్టానం మేడ్చల్ టికెట్‌ను బోడుప్పల్ నివాసి అయిన తోటకూర జంగయ్య యాదవ్‌కు కేటాయించడంతో మేడ్చల్ టికెట్ తనకే వస్తుందన్న ఆశతో ఉన్న హరివర్ధన్‌రెడ్డి హుటాహుటిన ఢిల్లీ నుంచి తిరిగి వచ్చి కీసరలోని తన పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన తనను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మోసం చేశారంటూ కార్యకర్తలతో కలిసి హరివర్ధన్‌రెడ్డి కంట తడి పెట్టాడు. రేవంత్‌రెడ్డి టికెట్ ఇస్తానంటేనే పార్టీ కార్యక్రమాలకు ఐదేండ్లుగా రాత్రింబవళ్లు కష్టపడ్డాను అని హరివర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తూ రేవంత్ మేడ్చల్ టికెట్ విషయంలో తగిన సమాధానం చెప్పాలంటూ ఆయన డిమాండ్ చేశారు. మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి గెలుపు కోసం తను రాత్రింబవళ్లు కష్టపడ్డానని తెలిపారు. రాజకీయం కోసం తన సొంత ఆస్తులు అమ్ముకొని ప్రజల పక్షాన, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పక్షాన నిలబడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ప్రస్తుతం మౌనంగా ఉండిపోతానని కంట తడి పెడుతూ పార్టీ శ్రేణులకు వివరించారు. సర్వేల ప్రకారం మేడ్చల్‌లో టికెట్ ఇస్తామని చెప్పిన నేతలు తనకు 73 శాతం సర్వేలో అనుకూలంగా ప్రజలు మద్దతు పలికారని, సర్వేలను కూడా కాలదన్ని ప్రజల్లో ఆదరణ లేని జంగయ్య యాదవ్‌కు టికెట్ కేటాయించడంపై కాంగ్రెస్ శ్రేణులు, హరివర్ధన్‌రెడ్డి అభిమానులు మండి పడ్డారు.

### హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతుండగా.. జంగయ్య యాదవ్ ప్రత్యక్షం..

కాంగ్రెస్ పార్టీ సమావేశంలో హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతుండగా.. అంతలో తోటకూర జంగయ్యయాదవ్ ప్రత్యక్ష్యం అయ్యారు. వెంటనే హరివర్ధన్‌రెడ్డి అభిమానులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. రెండు గ్రూపుల నేతలు ఒకరిపై ఒకరు తిట్టుకున్నారు.

### రేవంత్‌రెడ్డి గెలుపు కోసం చాలా కష్టపడ్డా..

మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రేవంత్‌రెడ్డి కోసం తను అహర్నిశలు పని చేశానని అన్నారు. మల్కాజిగిరి ఏరియాల్లోని ప్రతి కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను కలిసి రేవంత్‌రెడ్డి గెలుపు కోసం కష్టపడ్డానని తెలిపారు. తనను నమ్మించి మోసం చేసిన రేవంత్ తనకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

– హరివర్ధన్‌రెడ్డి

## మ్యానిఫెస్టో విడుదలతో.. ప్రతి పక్షాలు జంకుతున్నాయ్

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- బీజేపీ, కాంగ్రెస్‌కు పార్టీలకు చెందిన 100 మంది బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్, అక్టోబర్ 15 : బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేయడంతో ప్రతిపక్షాలు జంకుతున్నాయని, ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ సారథ్యంలో అధికారం చేపట్టబోతున్నామని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కార్పొరేషన్‌లోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంలోనే జవహర్‌నగర్ రూపురేఖలు పూర్తిగా మారిపోయానని, 150 కోట్లతో కార్పొరేషన్ కొత్తరూపు అవతరించిందని, జవహర్‌నగర్‌ను బంజారాహిల్స్‌గా మాస్తుందన్నారు. పార్టీలో చేరిన బీజేపీ సీనియర్ నాయకుడు మేకల రాజు, కాంగ్రెస్ నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, పల్లపు రవి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్/ఎల్బీనగర్, అక్టోబర్ 15 : విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చింతలకుంటలోని పల్లవి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ఉప్పల్ భగాయత్‌లో రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. స్వరాష్ట్రం వచ్చిన తర్వాతనే సీఎం కేసీఆర్ విశ్వబ్రాహ్మణుల భవనం కోసం స్థలాన్ని కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. విశ్వబ్రాహ్మణుల న్యాయబద్ధమైన కోరికలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులు తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారు



ఎమ్మెల్యే కాలేరుకు మద్దతు ప్రకటిస్తున్న బర్కత్‌పుర జైన్ కమ్యూనిటీ ప్రజలు

కాచిగూడ, అక్టోబర్ 15 : తెలంగాణ అభివృద్ధిని చూసి రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని మెజిస్టిక్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌లోని 450 మంది జైన్ కమ్యూనిటీ మార్వాడీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి గడపలోని ప్రజలు ఏదో ఒక తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని అనుభవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యోగేశ్‌జైన్, బాబిన్, రక్షిత్, సాయి, ఎర్ర భీష్మాదేవ్, బుచ్చిరెడ్డి, మధు, నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో కేపీని మళ్లీ గెలిపించుకుంటాం

### ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా తీర్మానాలు



ఎమ్మెల్యే కేపీకి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాన్ని అందజేస్తున్న గాజులరామారం డివిజన్ పెద్దమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

దుండిగల్, అక్టోబర్ 15 : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు మద్దతుగా నిలిచేందుకు ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ముందుకు వస్తున్నారు. కాలనీ మొత్తం ఎమ్మెల్యేకు మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయానికి నాంది పలుకుతామని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి ఆయనకు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గాజులరామారం డివిజన్ పరిధిలో పెద్దమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, రంగారెడ్డి నగర్ డివిజన్ వెంకట్రామ్ రెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వేర్వేరుగా తమ ఏకగ్రీవ తీర్మానాలు అందించారు.



### బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్పకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు, యువకులు డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్ ఆధ్వర్యంలో విప్ అరెకపూడి గాంధీ సమక్షంలో ఆదివారం ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, పాండు, మణికంఠ, సాంబ, అనిల్, లక్ష్మి, ప్రసన్న, రవీందర్, పద్మాకర్, అక్తర్, శశాంక్, సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 15



## పథకాలకు ఆకర్షితులై.. బీఆర్ఎస్‌లో చేరిక

### కండువా కప్పి ఆహ్వానించిన ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీల పట్ల విశ్వాసం సన్నగిల్లి ప్రజాసంక్షేమం కోసం పని చేస్తున్న బీఆర్ఎస్, ఆ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. ఆదివారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దేవేందర్ సుమారు 40 మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– కాప్రా, అక్టోబర్ 15



## మూడోసారి బీఆర్ఎస్‌దే అధికారం

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ప్రతిపక్షాల మాటలకు విశ్వసనీయత లేదని, వాటిని ప్రజలు నమ్మరని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఇందిరానగర్‌కు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మామిడి నర్సింగరావు, డి.సింహం తదితరులు ఉన్నారు.

–బంజారాహిల్స్, అక్టోబర్ 15

## బీజేపీకి బుద్ధి చెబుతాం

రామంతాపూర్, అక్టోబర్ 15 : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తానని మాయమాటలు చెప్పి మాదిగలను మోసం చేస్తున్న బీజేపీని మాదిగలు ఎండగట్టాలని ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మేడిపాపన్న, వంగపల్లి శ్రీనివాస్ మాదిగలకు పిలుపునిచ్చారు. ఆదివారం హబ్సిగూడ సుప్రభాత్ హోటల్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దశాబ్ద కాలం నుంచి వర్గీకరణ పేరుతో మోసం చేస్తున్న బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రశంకర్, చిలక మరి గణేశ్, గుర్రాల శ్రీనివాస్, పొట్ట పెంజర రమేశ్, బల్గర్ హుస్సేన్, జీడి నర్సింహ, ఆకారపు రుక్కమ్మ, పందుల సంజీవ, చినగళ్ల యాదగిరి, సలేంద్ర బాబురావు, విద్యాసాగర్, దైద రవి, ఎల్ఆర్, మంచల యాదగిరి, వేణుగోపాల్, పోసాని తదితరులు పాల్గొన్నారు.